# పాఠశాల సిబ్బంది నిబద్ధత - భాగస్వామ్య నిర్ణయ ప్రక్రియ

**COMMITMENT OF SCHOOL STAFF - PARTICIPATORY DECISION MAKING**


**రచయిత**

పి. శ్రీహరి, ప్రధానోపాధ్యాయులు,

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆమనగల్,

జిల్లా: నల్లగొండ.

**ఎడిటింగ్**

డా. ఎస్. సురేష్ బాబు, కన్సల్టెంట్, స్కూల్ లీడర్షిప్ అకాడమీ,

ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబాద్.


2022-23


**స్కూల్ లీడర్షిప్ అకాడమీ**
**ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబాద్.**

**నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్షిప్,**
**ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NCSL-NIEPA), న్యూఢిల్లీ.**

## పరిచయం

పాఠశాలలో వివిధ రకాల నిర్ణయాలు తీసుకోవడంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం మరియు నిబద్ధత ఒకే నాణానికి రెండు వైపుల వంటివి. ఈ రెండు ఒక సంస్థ యొక్క సరైన పనితీరుకు ముఖ్యమైన అంశాలు. వివిధ రకాల సంస్థలలో ఇది నిజమైతే ఇది అభ్యసన సంస్థలలో కూడా వర్తిస్తుంది. అయితే సమర్ధవంతమైన పాఠశాల నిర్వహణకు ఉపాధ్యాయుల భాగస్వామ్యం ప్రధానమైనదని గుర్తించని పాఠశాల నాయకులు ఉన్నచోట చాలా సందర్భాలలో నిర్ణయం తీసుకునే ప్రక్రియ నుండి ఉపాధ్యాయులు మినహాయింపబడుతున్నారు. ఈ ధోరణి **కాలం చెల్లినదిగా** భావిస్తూ నిర్ణయం తీసుకోవడంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను గుర్తించడానికి ఈ మాడ్యూల్ రూపొందించబడినది. దీనిలో నిర్ణయం తీసుకోవడంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని ప్రభావితం చేసే అంశాలు, భాగస్వామ్య నిర్ణయం తీసుకోవడంలో పాఠశాల నాయకుల మద్దతు ఇవ్వకపోవడానికి వెనుకున్న కారణాలు, భాగస్వామ్య విధానాన్ని అభివృద్ధి చేయడంలో మరియు కొనసాగించడంలో పాఠశాల నాయకుని యొక్క నిర్దిష్ట పాత్ర గురించిన అంశాలను పరిగణలోకి తీసుకొని పాఠశాలలో విద్యా నాయకులకు మార్గదర్శకంగా ఉంటుందని ఆశిస్తూ...

## ఉద్దేశించబడిన లక్ష్యాలు

1. నిర్ణయం తీసుకోవడంలో పాఠశాల ఉపాధ్యాయుల ప్రమేయం ఎంత మేరకు ఉందో పరిశీలించడం.
2. ఉపాధ్యాయులు ఎక్కువగా పాల్గొనే నిర్ణయాత్మక అంశాలను గుర్తించడం.
3. నిర్ణయం తీసుకోవడంలో ఉపాధ్యాయుల ప్రమేయాన్ని ప్రభావితం చేసే అంశాలను తెలుసుకోవడం.
4. ప్రపంచ పోటీ కారణంగా, సంస్థలు ఆసక్తి కలిగి ఉన్న అంశాలలో ముఖ్యమైనవి. నిర్ణయం తీసుకోవడంలో ఉద్యోగులు చురుకుగా పాల్గొనడం మరియు నిబద్ధత ద్వారా సంస్థాగత అభివృద్ధి మరియు ఉద్యోగుల వృత్తిపరమైన అభివృద్ధి.

## కీలక పదాలు

ఉమ్మడి లక్ష్యం, ఆత్మగౌరవం, సృజనాత్మకత, సమాచార పారదర్శక ప్రసరణ, నిర్ణయాలు చేయడం, భాగస్వామ్య పరిధి, సంస్థ యొక్క విజయం, పాఠశాల నాయకత్వం.

## నిర్ణయ ప్రక్రియలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం

### కృత్యం

అభ్యాసకులను రెండు గ్రూపులుగా చేసి క్రింది కృత్యాన్ని ఇవ్వవలెను. వారి నుండి సమూహ నిర్ణయాలను లేదా సమూహ ప్రతిస్పందనలను ప్రదర్శింపజేయాలి.

**ప్రశ్న 1:** భాగస్వాములతో కలిసి నిర్ణయాలు చేయడం మంచిది. దీనిని సమర్థించువారు - అవి ఏ అంశాలు, కారణాలు, ప్రయోజనాలు చర్చించండి, రాయండి.

**ప్రశ్న 2:** భాగస్వాములతో కలిసి నిర్ణయాలు చేయడం సులువు కాదు - దీనిని సమర్థించువారు ఆ అంశాలు, కారణాలు, పరిష్కార మార్గాలు చర్చించండి, రాయండి.

ఉపాధ్యాయులకు, వారి సంస్థాగత విషయావసరాలను నిర్ధారించి, సంతృప్తిపరిచే స్థాయిలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో పాల్గొనటానికి సమయం మరియు అవకాశం అవసరం. ఎందుకంటే సంస్థ యొక్క నిర్ణయాలలో పాల్గొనేవారు, తాము ఒక ఉమ్మడి లక్ష్యంతో జట్టులో భాగమని భావిస్తారు మరియు వారి ఆత్మగౌరవం, సృజనాత్మక ఆలోచన పరిధి పెరుగుతుంది. అందువల్ల సంస్థలు ఉపాధ్యాయ భాగస్వామ్య నిర్ణయ ప్రక్రియను సంబంధాలను మెరుగుపరచడానికి, సభ్యుల పని ఉత్సాహాన్ని పెంచడానికి మరియు సంస్థ అంతటా సమాచార, పారదర్శక ప్రసరణ రేటును (information transparency rate) పెంచడానికి సాధనంగా ఉపయోగించవచ్చు.

నిర్ణయాధికారంలో ఉపాధ్యాయులు పాల్గొనే అనేక అంశాలు (అంటే తరగతిగది లోపల తీసుకొనే నిర్ణయాలు) ఉన్నప్పటికీ పాఠశాలలు ప్రత్యేకంగా ఉపాధ్యాయులకు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, పర్కుటుక్కుల ఎంపిక, గ్రంథాలయ పుస్తకాల ఎంపిక, పాఠ్యాంశాల అభివృద్ధి, అభ్యసనం-మూల్యాంకనం, తరగతిగది బోధనాభ్యసన పరిశీలన, విద్యార్థి-ఉపాధ్యాయ-తల్లిదండ్రుల సంబంధాల వంటి కార్యకలాపాలలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు భాగస్వాములు కావడానికి ప్రోత్సహించవచ్చు ఇది వృత్తిపరమైన అభివృద్ధికి మార్గాలను తెరవచ్చు. ఎందుకంటే నిర్ణయం తీసుకోవడంలో పాల్గొనే ఉపాధ్యాయులు ఆ నిర్ణయాలను అమలు చేయడానికి మరింత చిత్తశుద్ధితో కృషి చేయాలని భావిస్తారు.

ఉపాధ్యాయుల నిర్ణయ భాగస్వామ్యాన్ని మూడు స్థాయిలుగా వర్గీకరించవచ్చు. వ్యక్తిగత స్థాయి, సమూహ స్థాయి, సంస్థాగత స్థాయి.

**వ్యక్తిగత స్థాయిలో-** బోధన అభ్యసన సామాగ్రి ఎంపిక, బోధనా శైలి మరియు విద్యార్థుల మూల్యాంకనం వంటి తరగతిగదులలోని ఉపాధ్యాయుని వ్యక్తిగత పనితీరుకు దగ్గర సంబంధం ఉన్న అంశాలుంటాయి. గ్రూపు స్థాయిలో సబ్జెక్టు క్లబ్బులు, సబ్జెక్టు ప్యానల్స్ మరియు కో-కరికులర్ యాక్టివిటీ

గ్రూపులు మరియు వాటి పనితీరుకు చెందిన అంశాలుంటాయి. సంస్థాగత స్థాయిలో పాఠశాల విజన్, మిషన్, పాఠశాల బడ్జెట్, పాఠశాల గ్రాంట్స్ వినియోగం, నూతన కట్టడాలు చేస్తున్నప్పుడు/ రిపేరు చేస్తున్నప్పుడు (సివిల్ వర్క్స్), పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, పరీక్షలు, దాతల నుండి విరాళాల సేకరణ, వినియోగం, టైం టేబుల్, అడ్మిషన్స్ వంటి మొత్తం పాఠశాల స్థాయి విషయాలుంటాయి. అందుకే ఉపాధ్యాయులతో కలిసి నిర్ణయాలు తీసుకోవడం వల్ల పాఠశాల పరివర్తన (transformation) మరియు సానుకూల మార్పు తీసుకురాగలదు. సంస్థలో ఉద్యోగుల నిబద్ధతకు దోహదపడే అనేక అంశాలు ఉన్నప్పటికీ నిర్ణయం తీసుకోవడంలో పాల్గొనడం అనేది విస్మరించలేని అంశం.

## కృత్యం

మీ పాఠశాలలో ఉపాధ్యాయుల నిబద్ధత స్థాయిని ఎలా నిర్ణయిస్తారు?

1. ఉపాధ్యాయుల నిబద్ధత స్థాయిని గుర్తించడానికి పాఠశాల అకడమిక్ లీడర్ కు ఏ అంశాలపై పూర్తి అవగాహన ఉండాలి?

## భాగస్వామ్యం కాకపోవడానికి కారణాలు

పాఠశాల అకడమిక్ లీడరుగా వారి పాఠశాలలోనే ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుల మద్దతు ఇవ్వకపోవడానికి మరియు ఉపాధ్యాయులు భాగస్వామ్య నిర్ణయ ప్రక్రియలో పాల్గొనడానికి ముందుకు రాకపోవడానికి గల కారణాలను విశ్లేషించాలి. వాటిలో క్రింది విధంగా ఉండవచ్చు.

1. తక్కువ స్థాయిలో పట్టింపు ఉన్న ఉపాధ్యాయులు
2. ఉపాధ్యాయులు మరియు పాఠశాల నాయకుల మధ్య నమ్మకం మరియు సానుకూల సంబంధం లేకపోవడం.
3. ఉపాధ్యాయులను భాగస్వాములుగా చేర్చుకోవడానికి పాఠశాల నాయకులకు సరైన ప్రేరణ లేకపోవడం.
4. అందుబాటులో ఉన్న వనరుల కొరత (సమయం, డేటా, మొదలగునవి)
5. ప్రధానోపాధ్యాయుల నిరంకుశ నాయకత్వ శైలి.
6. ఉపాధ్యాయులు రిస్క్ తీసుకోవడానికి భయపడడం.
7. పాఠశాల లీడర్లు ఆమె/ అతని స్వేచ్ఛ మరియు అధికారం తగ్గకూడదనే ఆలోచన.
8. భాగస్వామ్య నిర్ణయాలు తీసుకోవడానికి ఉపాధ్యాయులకు గల అయిష్టత, నిబద్ధత లేకపోవడం.

అయితే పాఠశాల ఉపాధ్యాయులు లేవనెత్తే ప్రభావితం చేసే ప్రధానాంశాలు కూడా ఉంటాయి.

1. ప్రధానోపాధ్యాయులు ఇష్టమైన రీతిలో పనుల కేటాయింపు, అంటే ఉపాధ్యాయుల పనితీరు ఆధారంగా కాకుండా వారి పరిపాలన సౌలభ్యతకు లేదా ఏదో విధంగా అనుకున్న పనులను ముగించడానికి పనులు కేటాయించడం.
2. ప్రధానోపాధ్యాయులు వారికి సన్నిహితంగా ఉన్న వారిపై పాఠశాల నిర్వహణకు ఆధారపడడం.
3. మానవ వనరుల శక్తిని సరిగా ఉపయోగించుకోలేకపోవడం.
4. బలహీనమైన మార్గదర్శక నియమాలు మరియు విద్యార్థుల నియంత్రణ.
5. సమూహంలో చర్చించడం కన్నా ముందే పాఠశాల నాయకులు సమస్య గురించిన ఆలోచనలను వారికి అనుకూలంగా ఉన్న వారితో మాత్రమే పంచుకోవడం.
6. పాఠశాల నాయకులు, పాఠశాలలోని ఉపాధ్యాయులను వారి ప్రయత్నానికి అనుగుణంగా ప్రేరేపించడానికి, రివార్డులు మరియు గుర్తింపునివ్వడానికి ఇష్టపడకపోవడం.
7. పాఠశాల నాయకులు – ఉపాధ్యాయుల మధ్య కమ్యూనికేషన్ లో పారదర్శకత లేకపోవడం, రహస్య ఎజెండాలు, వాటి అమలుకు ప్రయత్నించడం.
8. భాగస్వాములై తీసుకున్న నిర్ణయాల అమలు గురించి ఉపాధ్యాయులకు గల అనిశ్చితి.
9. సరైన పర్యవేక్షణ లేకపోవడం.
10. స్పష్టంగా ముఖాముఖి చర్చించకుండా దూరంగా ఉండి ఒకరు లేదా కొందరు ఉపాధ్యాయులను గురించి వేరొక ఉపాధ్యాయునితో ఆపేక్షించడం (కామెంట్ చేయడం)

ఇంకా ఏమైనా కారణాలున్నాయేమో సభ్యులతో చర్చించి చార్టు తయారు చేయాలి. వీటికి పరిష్కార మార్గాలను కూడా సూచించమని సభ్యులను కోరాలి. వాటిని కూడా చార్టుపై తయారుచేసి ప్రదర్శించమని కోరాలి.

## భాగస్వామ్య విధానాన్ని అభివృద్ధి చేయడం మరియు కొనసాగించడంలో పాఠశాల నాయకుని నిర్దిష్ట పాత్ర

పాఠశాల అకడమిక్ లీడర్ అంటే బోధనాభ్యసన సమస్యలపై నాయకత్వం వహించడానికి తప్పనిసరిగా సిద్ధంగా ఉండాలి మరియు ప్రేరణ కలిగి ఉండాలి. నిర్ణయాత్మక ప్రక్రియలో పాల్గొనే వారందరికీ పాఠశాల విజన్, మిషన్ ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలి. దాన్ని వారికి తెలియజేయడం తన విధిగా పాఠశాల నాయకుడు గుర్తించాలి. ఉపాధ్యాయులు హేతుబద్ధమైన సమస్యా పరిష్కారం కొరకు బాధ్యతాయుతంగా వ్యవహరించడానికి పాఠశాల వాతావరణం అనువైనప్పుడు ఆ పాఠశాల మార్పుకు (పరివర్తనకు) వారితో కలిసి పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు శక్తివంతమైన దోహదకారిగా ఉంటారు.

పాఠశాల నాయకుల నిబద్ధతకు నిదర్శనంగా ఉపాధ్యాయుల అభిప్రాయాలకు, వారిచ్చే సమాచారాన్ని తీసుకోవడానికి, వారి నిర్ణయాలను వినడానికి సమయాన్ని కేటాయించడం చెప్పవచ్చు. పాఠశాల నాయకుల ఈ నిబద్ధత ఉపాధ్యాయులకు భాగస్వామ్య నిర్ణయ ప్రక్రియలో వారి ప్రమేయాన్ని ప్రారంభించడానికి మరియు కొనసాగించడానికి ప్రోత్సహాన్నిస్తుంది.

Mc. Ewan (2021) ప్రకారం ఉపాధ్యాయుల బలమైన తోడ్పాటును అభివృద్ధి చేయడంలో విఫలమైన ప్రధానోపాధ్యాయులు వారి నుండి నేర్చుకునే అవకాశాన్ని మరియు ప్రొఫెషనల్ ఎదుగుదలను (వృత్తిపరమైన అభివృద్ధిని) కోల్పోవచ్చు.

Raman, A. etal (2015) భాగస్వామ్య నాయకత్వం అందించే శక్తిని కోల్పోయిన పాఠశాల నాయకులు పోట్లాటలో గెలుపొందొచ్చు, అంటే వ్యూహం అమలులో గెలుపొందొచ్చు, కానీ యుద్ధంలో ఓడిపోవచ్చు.

భాగస్వామ్య నిర్ణయ ప్రక్రియా నైపుణ్యాలు లేని వారే అన్నింటినీ స్వంతంగా చేయడానికి ప్రయత్నిస్తారు. ప్రభావవంతమైన మరియు విజయవంతమైన పాఠశాల నాయకులు నేర్చుకుంటారు మరియు సాధన చేస్తారు.

పాఠశాల నాయకులు సరిగ్గా సాధన చేస్తే, క్రింది అంశాలు ఉపాధ్యాయులు పాఠశాల నిర్ణయాత్మక ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహిస్తాయి మరియు సరిగ్గా సాధన చేయకపోతే వారు నిర్ణయం తీసుకునే అన్ని అంశాలలో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని నిరోధించే అవకాశం ఎక్కువగా ఉండొచ్చు.

భాగస్వామ్య నిర్ణయ ప్రక్రియలో క్రింద ఇవ్వబడిన అంశాల నుండి ఒక్కొక్క అంశం యొక్క ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాన్ని చాలా తక్కువ నుండి చాలా ఎక్కవ. 1-5 వరకు స్కేలులో తెలియజేయమని శిక్షకులను కోరాలి. దీని వలన పాఠశాల నాయకులందరూ ఉపాధ్యాయుల ప్రమేయం కోసం పాఠశాల వాతావరణాన్ని సులభతరం చేయగలగడం గురించి ఆలోచించవచ్చు.

**ప్రాముఖ్యతను 1-5 రేటింగ్ స్కేలుపై తెలియజేయవలసిన అంశాలు – ఉపాధ్యాయుల ప్రమేయాన్ని పెంచడం కోసం**

1. **ఉపాధ్యాయులకు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛను కల్పించడం.** ☐
2. **బాధ్యతను అందరితో పంచుకోవడం.** ☐
3. **పాఠశాల జట్టు సభ్యుల మధ్య మంచి వృత్తిపర సంబంధాన్ని ఏర్పరచుకోవడం, నిర్వహించడం.** ☐
4. **సమాచారాన్ని లేదా విషయాన్ని అందరికీ స్పష్టంగా తెలియజేయడం.** ☐

5. ఉపాధ్యాయుల ఆలోచనలకు గుర్తింపునివ్వడం.

6. ఉపాధ్యాయులు అందరి నుండి సమ్మతిపొందే విషయాలు కల్గి ఉండడాన్ని అనుమతించడం.

7. ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి కోసం స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదించడం, అందరితో చర్చించడం.

8. అందరికీ మద్దతు అందించడం, నమ్మకమైన వాతావరణాన్ని కల్పించడం.

9. సమూహం నుండి విభిన్నమైన ఆలోచనలు వచ్చినపుడు విమర్శలను సులభతరం చేయడం మరియు అనుసంధానం చేసి ఏకాభిప్రాయానికి తీసుకోవడం.

10. ఉపాధ్యాయుల నుండి ఏం ఆశిస్తున్నారో పారదర్శకంగా వివరిస్తుండడం.

11. జట్టుపని మరియు గ్రూపు కార్యకలాపాలను అనుమతించడం, ప్రోత్సహించడం.

12. చర్చనీయాంశంపై ఉపాధ్యాయులందరికీ అవగాహన కల్పించడం.

13. నవకల్పనలను, నవకల్పనా ఆలోచనలను అందరితో పంచుకోవడానికి ప్రేరేపించడం.

14. టీచర్లు సాధించిన ప్రతిచిన్న విద్యావిషయక విజయాన్ని సంబరంగా జరుపుకోవడం.

15. ఉపాధ్యాయులలో యాజమాన్య భావాన్ని పెంపొందించడానికి వారికి మద్దతు ఇవ్వడం.